క్లుప్తంగా

ఆత్మీయ కలయిక



వైఎస్సార్‌సీపీ అధినేతతో పొన్నాల అనిత, వెర్రి శ్రీను

కామవరపుకోట: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మండలంలోని నాయకులు మంగళవారం తాడేపల్లిలోని కేంద్ర పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఈస్ట్ యడవెల్లి గ్రామ సర్పంచ్ పొన్నాల అనిత, తడికలపూడికి చెందిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఐటీ విభాగం కన్వీనర్ వెర్రి శ్రీను వైఎస్సార్‌సీపీ అధినేతను కలిశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారని వారు తెలిపారు.

కొయ్యలగూడెం తహసీల్దార్‌గా నాగరాజు



తహసీల్దార్ నాగరాజు

కొయ్యలగూడెం: మండలం తహసీల్దార్‌గా ఎన్.నాగరాజును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నిడమర్రు మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను కొయ్యలగూడేనికి బదిలీ చేశారు. గతంలో ఆయన 2019 జూలై నుంచి 2020 ఆగస్టు వరకు కొయ్యలగూడెం మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన కె.చెల్లన్నదొరను ఏలూరు కలెక్టరేట్ కార్యాలయానికి బదిలీ చేసిన సంగతి తెలిసిందే.

సీడీపీఓ బాధ్యతల స్వీకరణ



సీడీపీఓగా బాధ్యతలు చేపడుతున్న పద్మావతి

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం: ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓగా యూవీ పద్మావతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గోపాలపురం సీడీపీఓగా పని చేస్తున్న ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ సీడీపీఓగా పని చేస్తున్న ఇ.తులసి ఏలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో నోడల్ అధికారిగా బదిలీపై వెళ్లారు. కాగా పద్మావతి 2008–18 వరకూ బుట్టాయగూడెం సూపర్‌వైజర్‌గా పని చేశారు. బాధ్యతలను స్వీకరించిన పద్మావతిని కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

ఆటో కార్మికులకు రూ.15 వేలు ఇవ్వాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ

జంగారెడ్డిగూడెం: ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.15 వేలు ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ ఏపీ ప్రగతిశీల ఆటో మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం జంగారెడ్డిగూడెంలోని బుట్టాయగూడెం సెంటర్, మసీద్ సెంటర్, బస్టాండ్ సెంటర్, మదర్ తెరిసా ఆసుపత్రి సెంటర్, తదితర ఆటో స్టాండ్ ప్రాంతాల్లో విస్తృతంగా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆటో కార్మికులకు, డ్రైవర్లకు మోసకారి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వైఎస్‌సీఎల్ క్రికెట్ ట్రయల్స్‌కు సొంగా ప్రజిత్‌సహాయ్ ఎంపిక



క్రికెట్‌కు ఎంపికైన సొంగా ప్రజిత్ సహాయ్

లింగపాలెం: 10 ఏళ్ల వయసున్న ఆశా జనక యువ క్రికెటర్ సొంగా ప్రజిత్‌సహాయ్ విశాఖపట్నంలో నిర్వహించిన యూత్ సూపర్ క్రికెట్ లీగ్ (వైఎస్‌సీఎల్) ట్రయల్స్‌కు ఎంపికయ్యాడు. వివరాల్లోకి వెళితే ప్రతిభావంతులైన బ్యాట్స్‌మేన్‌గా తనను తాను ప్రాతినిధ్యం వహిస్తూ మే 27, 2025న విశాఖపట్నంలో నిర్వహించిన క్రికెట్ పోటీల ఎంపికలో ప్రజిత్ అద్భుతమైన టెక్నిక్, దృఢ సంకల్పాన్ని ప్రదర్శించాడు. వచ్చే నెల అండర్–14 విభాగంలో రాష్ట్రం తరపున యూత్ సూపర్ క్రికెట్ లీగ్ టీమ్‌లో ప్రజిత్ ఆడనున్నాడు.

అభివృద్ధికి ఆమడ దూరం

- మండల కేంద్రంలో అధ్వానంగా పారిశుధ్యం
- రహదారులు గుంతల మయం
- పట్టించుకోని యంత్రాంగం.. వ్యాధుల బారిన ప్రజలు



టి.నరసాపురం ప్రధాన సెంటర్‌లో గోతిలో నిల్వ ఉన్న మురుగు నీరు

టి.నరసాపురం: పేరుకే మండల కేంద్రం అభివృద్ధికి ఏమాత్రం నోచుకోలేదు. ప్రభుత్వాలు మారినా అభివృద్ధి మాత్రం శూన్యంగానే ఉంది. కనీసం పూర్తిగా డ్రెయినేజీ వ్యవస్థ కూడా లేదంటే మండల కేంద్ర అభివృద్ధి ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో టి.నరసాపురం ప్రధాన సెంటర్ నుంచి రోడ్డుకు ఒక వైపున డ్రెయినేజీ నిర్మించారు. పూర్తి స్థాయిలో గ్రామంలో డ్రెయినేజీలు లేక మురుగు నీరు పారే పరిస్థితి లేదు. రోడ్లపైనే నీరు నిల్వ ఉంటోంది. ఏ మాత్రం వర్షం పడినా గుంతల్లో రోజుల తరబడి నీరు నిల్వ ఉండి దుర్గంధభరితమవుతోంది. ఇటు రహదారుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. చింతలపూడి–టి.నరసాపురం రహదారి గురించి వేరే చెప్పనక్కర్లేదు. రోడ్డు గుంతల మయం. మండల కేంద్రానికి నలువైపులా ఉన్న రహదారులు ఛిద్రంగానే ఉన్నాయి. టి.నరసాపురం నుంచి చింతలపూడి, మక్కినవారిగూడెం, బందంచర్ల, ఏపుగుంట వెళ్లే రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మండల కేంద్రమైన టి.నరసాపురానికి ఏ పనికి రావాలన్నా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఓ పక్క రహదారి సరిగ్గా లేకపోవడం, మరో పక్క టి.నరసాపురంలో సరైన వసతులు లేకపోవడంతో ప్రజలు మండల కేంద్రానికి రావడానికి బెంబేలెత్తుతున్నారు. చెప్పుకోదగ్గ వ్యాపార కార్యకలాపాలు కూడా ఇక్కడ నిర్వహించడానికి అనువైన వసతులు లేవు. పూర్తి స్థాయిలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం, ఉన్న చెరువులు పూడుకుపోవడంతో కొండలపై కురిసిన వర్షపు నీరు టి.నరసాపురాన్ని ముంచెత్తుతుంది. ప్రతి ఏటా వర్షా కాలంలో ఎర్ర చెరువు నివాసిత ప్రాంతం నీట మునుగుతుంది. అలాగే ఈ వర్షపు నీరు అధిక ప్రవాహం వలన టి.నరసాపురం కనకదుర్గమ్మ గుడి వద్ద రాకపోకలు సైతం బంద్ అవుతున్నాయి.

పేరుకే మండల కేంద్రం



పేరుకే మండల కేంద్రం, ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో డ్రెయినేజీ వ్యవస్థ కూడా లేదు. చుట్టు పక్కల ఉన్న గ్రామాలకు ఏ అవసరం వచ్చినా టి.నరసాపురం రావాల్సిందే. అయితే ఇక్కడ సరైన సదుపాయాలు లేకపోవడంతో ఇక్కడి నుంచి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో వ్యయ ప్రయాసలతో పాటు, ఇబ్బందులు కూడా ఎదుర్కోవాల్సి వస్తోంది.
–నల్లూరి శ్రీనివాసరావు, వ్యాపారి, టి.నరసాపురం

యోగాతో ఒత్తిడి దూరం



అంగన్‌వాడీ కేంద్రంలో యోగాసనాలు నేర్చుకుంటున్న మహిళలు

కొయ్యలగూడెం: యోగా డ్రైవ్ మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పొంగుటూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో యోగాసనాల కార్యక్రమం సూపర్‌వైజర్ అంబటి సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళలు ఒత్తిడి అధిగమించడానికి అనారోగ్య సమస్యల నుంచి బయట పడడానికి యోగా దివ్య ఔషధం వంటిదని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో యోగాసనాలు నిర్వహించారు. ఈ నెల 21వ తేదీ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఐటీడీఏలో మెగా జాబ్ మేళా



ఐటీడీఏలో జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులతో పీఓ రాములు నాయక్

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో నేషనల్ కెరియర్ సర్వీస్, ఐటీడీఏ సంయుక్తంగా వైటీసీ మీటింగ్ హాల్‌లో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్, పలు సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. జాబ్ మేళాలో 11 మంది అభ్యర్థులను అతిపెద్ద చాక్లెట్ తయారీ సంస్థకు ఎంపిక చేసి ఉద్యోగ ఆఫర్ లెటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అన్న ప్రసాద వితరణ



అన్నప్రసాదం స్వీకరించేందుకు క్యూలో నిలుచున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: సుందర బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. తొలుత స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి, అన్న ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించారు. పట్టణానికి చెందిన శ్రీనివాస క్లాత్ అండ్ రెడీమేడ్ యజమాని తడికమళ్ల శ్రీనివాసరావు, శ్రీ మద్ది సీతారామాంజనేయ జ్యూయలరీస్ యజమాని వనపర్తి అప్పల శ్రీనివాస్, మాడా గణేష్, దారా ప్రసాద్ సహకారంతో అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

మంచినీటి ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన

పోలవరం రూరల్: మండలంలో 22 రక్షిత మంచినీటి ట్యాంక్‌ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కేవీ గంగరాజు తెలిపారు. ఒక్కో ట్యాంక్ నిర్మాణానికి సుమారు రూ.30 వేల చొప్పున రూ.6.14 కోట్లు మంజూరైందని త్వరలో వీటి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. దీనిలో భాగంగా మంగళవారం వింజరం, బోడిగూడెం, బక్కబండార్లగూడెం, గుంజవరం, ప్రగఢపల్లి గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకం ట్యాంక్‌ల నిర్మాణానికి ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు శంకుస్థాపన చేశారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

గణపవరం: గర్భిణులు వైద్యుల సూచనలు పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పురుడు పోసుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలు పొందొచ్చని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి అన్నారు. మంగళవారం గణపవరం పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గణపవరంలోని నాలుగు గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న 78 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి నెలా 9, 10 తేదీల్లో పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో రక్త, యూరిన్ పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని, అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి



టి.నరసాపురం: తహసీల్దార్ టి.సాయిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు



చింతలపూడి: తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మికులు

టి.నరసాపురం: సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) మండల కార్యదర్శి తాడిగడప జయరాజు డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి, తహసీల్దార్ టి.సాయిబాబాకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీరంకి వెంకట్రావు, పులి సత్యనారాయణ, చమటపాము బాలశౌరి, కె.రాజు, కొమ్మంటి వెంకటేశ్వరరావు, పోలగాని సత్యనారాయణ, ఉప్పులూరి యుగంధర్, శిలారపు మద్ది రాముడు, సుందరంపాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

వేలేరుపాడు: పేద ప్రజలు, రైతులు, నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ మునీర్, ఏలూ రు జిల్లా కార్యవర్గ సభ్యులు కారం దారయ్య, నాయకులు బాడిశ రాము, పిట్టా వీరయ్య, బంధం అర్జున్, తాటి దుర్గారావు, బంధం నాగేశ్వరావు, యర్ర మధు, కురిమల వెంకటేశ్వర్లు, సోడే ప్రసాద్, కంగాల గంగరాజు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

చింతలపూడి: ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్ర నాయకత్వ పిలుపులో భాగంగా చింతలపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ డి.ప్రమద్వరకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బోడ వజ్రం, ముల్లగిరి లాజరు, అలెగ్జాండర్, మాణిక్యాలరావు, పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

కుక్కునూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఇచ్చిన హామీలను విస్మరించిందని మాటలకే వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కురాకుల బాబురావు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు.

పశువుల ఆకస్మిక మృతి



మృతి చెందిన పశువులు

కొయ్యలగూడెం: గవరవరం గ్రామ సమీపంలోని ఒక రైతుకు చెందిన పశువులు మంగళవారం మృతి చెందడం రైతుల్లో కలకలం రేపింది. కౌలుకు వ్యవసాయం చేసే గుర్తి శ్రీనివాస్, అతడి సోదరులు పదిహేను పశువులను మేపుతున్నారు. అయితే ఇందులో తొమ్మిది పశువులు అస్వస్థతకు గురయ్యాయి. అస్వస్థతకు గురైన వాటిలో ఐదు పశువులు మృత్యువాత పడ్డాయని వెటర్నరీ డాక్టర్ బీఆర్ శ్రీనివాస్ తెలిపారు. మిగిలిన నాలుగు పశువులకు కూడా ప్రాణాపాయ స్థితికి వెళ్లగా వాటికి చికిత్స అందిస్తున్నామన్నారు. పశు పోషకులు ఉన్న ప్రాంతం, పశువులు మేసిన ఆహారం, నీరు కలుషితమై ఉండొచ్చని విష ప్రభావం చేత ప్రమాదానికి గురై ఉంటాయని శ్రీనివాస్ తెలిపారు. చికిత్స తీసుకుంటున్న పశువుల నుంచి శాంపిల్స్ సేకరించామని ల్యాబ్ రిపోర్ట్ అనంతరం పశువుల మృతికి గల కారణాలు వెల్లడవుతాయన్నారు. మృతి చెందిన పశువుల విలువ మూడు లక్షల వరకు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. కాగా గత ప్రభుత్వం వరకు బీమా సౌకర్యం అమలు చేశారని, అనంతరం బీమా సదుపాయం ఎత్తివేయడంతో తమకు తీవ్ర నష్టం వాటిల్లిందని వాపోయారు.

పారిజాతగిరిని సందర్శించిన జేసీ, ఎస్పీ



ఎస్పీ కేపీఎస్ కిషోర్, జేసీ ధాత్రి, ఆర్డీవో రమణలకు ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: ప్రపంచ యోగా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా జంగారెడ్డిగూడెం వచ్చిన జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్, జేసీ పి.ధాత్రిరెడ్డి దంపతులు మంగళవారం పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో మానికల రాంబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఎస్పీ, జేసీలకు వేదాశీర్వాదం అందించి, స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు.

మద్దిలో..

యోగా దినోత్సవం అభ్యాసన కార్యమంలో భాగంగా మంగళవారం మద్ది క్షేత్రంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్, జేసీ పి.ధాత్రిరెడ్డి దంపతులు మద్ది ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఆలయ ఈవో ఆర్‌వీ చందన అందజేశారు.

యోగా కార్యక్రమం నిర్వహణ

జంగారెడ్డిగూడెం: మద్ది ఆంజనేయస్వామి ఆలయం వద్ద యోగాంధ్ర అభ్యాసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, ఆర్డీవో ఎంవీ రమణ, ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

వేలేరుపాడు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు వెంటనే బకాయిలు చెల్లించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు మంగళవారం నిరసన వ్యక్తం చేసి అనంతరం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ మునీర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కారం ధారయ్య, మండల కార్యదర్శి బాడిశ రాము, బంధం అర్జున్, తాటి దుర్గారావు, బంధం నాగేశ్వరరావు, యర్ర మధు, కురిమెళ్ళ వెంకటేశ్వర్లు, సుడే ప్రసాద్, కంగాల గంగరాజు, తెల్ల మహేష్, సోడే సత్తిబాబు, కరక ముత్యాలు, బుడిపిటి జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

18న సీపీఐ బైక్ ర్యాలీలు

చింతలపూడి: సీపీఐ ఏలూరు జిల్లా రెండో మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఈనెల 18వ తేదీన జిల్లా వ్యాప్తంగా బైక్ ర్యాలీలు నిర్వహించాలని మహా సభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు మామిళ్లపల్లి వసంతరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చింతలపూడి పట్టణంలో జూలై 5, 6, 7 తేదీల్లో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సహాయ కార్యదర్శి ఉప్పులూరు హేమశంకర్, రాష్ట్ర సమితి సభ్యుడు బండి వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య, సన్నేపల్లి సాయిబాబా, జంపన వెంకట రమణ రాజు, కొండేటి బేబి, తుర్లపాటి బాబు, పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ట్రాన్స్‌జెండర్లు



డాంగేనగర్‌లో అగ్ని ప్రమాద బాధితులకు సహాయాన్ని అందిస్తున్న ట్రాన్స్‌జెండర్లు

జంగారెడ్డిగూడెం: ట్రాన్స్ జెండర్లు మానవత్వాన్ని చాటుకున్నారు. అగ్ని ప్రమాద బాధితులకు తాము న్నామంటూ ఆపన్నహస్తం అందించారు. పట్టణంలోని 27వ వార్డులోని మొడియం లక్ష్మణ్‌నగర్‌లో ఆదివారం అర్థ రాత్రి విద్యుత్ హై వోల్టేజ్‌తో పలువురి ఇళ్లల్లో విద్యుత్ పరికరాలు, ఇంటి సామగ్రి దగ్ధమైన ఘటన తెలిసిందే. ఈ ఘటనలో పొడుదోలు నాగేంద్రబాబు తీవ్రంగా నష్టపోయాడు. ఆటో జీవనాధారంగా జీవించే నాగేంద్ర కుటుంబాన్ని డాంగే నగర్‌లో నివాసముంటున్న ట్రాన్స్‌జెండరుల సహాయం చేశారు. తమ వంతుగా రూ.32 వేలను నాగేంద్ర కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కావేరి, దుర్గ, అను, అనిత, వైశు, మీనా, సోన్, రాధిక, లక్ష్మి, అవంతిక, సత్య, శృతి, నిత్య, విజ్జు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో దుష్పరిణామాలు



ద్వారకాతిరుమల: పంగిడిగూడెంలో కిశోర బాలికలతో నిర్వహిస్తున్న ర్యాలీ



బుట్టాయగూడెం: కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ మొడియం రామతులసి

ద్వారకాతిరుమల: బాల్య వివాహాల వలన బాలికల్లో అనేక అనారోగ్య, సామాజిక దుష్పరిణామాలు కలుగుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.మేరి అన్నారు. మండలంలోని పంగిడిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కిశోర బాలికల వేసవి ప్రత్యేక శిబిరాల ముగింపు కార్యక్రమంలో మేరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిశోర బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ఆమె గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మేరి మాట్లాడుతూ 18 ఏళ్ల వయస్సు లోపు బాలికలకు, 21 ఏళ్ల వయస్సు లోపు బాలురకు వివాహాలు చేయడం వలన అనేక సమస్యలు ఎదురవుతాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.

ముగిసిన కిశోర వికాసం

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం, రాజానగరంలో కిశోర వికాస్ వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్ ఉయికే బొజ్జి మాట్లాడుతూ శిక్షణ పొందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రత్యేక కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్‌వీ సత్యవతి, అంగన్‌వాడీ టీచర్లు కుమారి, సుజాత, కార్యదర్శి పి.మంగరాజు, వేల్ఫేర్ అసిస్టెంట్ కె.సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాలికాభివృద్ధికి కిశోరి వికాసం

కొయ్యలగూడెం: బయ్యన్నగూడెంలో మంగళవారం కిశోరి బాలికా వేసవి వికాసం 2.0 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికల అభివృద్ధికి కిశోరి వికాసం కార్యక్రమం దోహదపడుతుందని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. ముఖ్యంగా కిశోరి వయసు బాలికల్లో సంభవించే మార్పులు అందుకు అనుగుణంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రజా ప్రతినిధులు, పలు రాజకీయ పార్టీల నాయకులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు.

మహిళల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎ.శ్యామలారాణి

జంగారెడ్డిగూడెం: మహిళలు ఇంటా బయట పని ప్రదేశాల్లో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి అన్నారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఐద్వా మండల మహాసభ మంగళవారం నిర్వహించారు. ఈ సభకు వి.అరుణకుమారి అధ్యక్షత వహించగా, జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలరాణి మాట్లాడుతూ మద్యం విచ్చలవిడిగా పారుతుందని మంచినీళ్లు మాత్రం దొరకటం లేదన్నారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేయాలని కోరారు. యాగటి సీత, ఎం.మంగ, జి.దీప, జి.మరియమ్మ, డి.వాణి పాల్గొన్నారు

ఎండీఎం బియ్యాన్ని పాఠశాలలకు తరలించాలి



ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న జేసీ పి.ధాత్రిరెడ్డి

జంగారెడ్డిగూడెం: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సంబంధించి బియ్యాన్ని ఈ నెల 11వ తేదీ బుధవారం నాటికి అన్ని పాఠశాలలకు తరలించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. మంగళవారం పట్టణంలో గల ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలకు పంపే బియ్యాన్ని ఆమె పరిశీలించారు. అలాగే గోడౌన్‌లో ఉన్న స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు. అనంతరం పట్టణంలో గల పద్మ థియేటర్ సమీపంలో ఉన్న 37వ రేషన్ షాపును ఆమె తనిఖీ చేశారు. అలాగే దివ్యాంగులకు, వృద్ధులకు త్వరితగతిన ఇంటికే రేషన్ సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎంవీ రమణ, తహసీల్దార్ కె.స్లీవజోజి, సీఎస్ జిల్లా మేనేజర్ శివమూర్తి, సీఎస్‌డీటీ సీహెచ్ వెంకటేశ్వరరావు, డీటీ రమేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.